క్లుప్తంగా

బడిఈడు పిల్లలపై సర్వే



కేటీదొడ్డి: మండలంలోని ఉమిత్యాలలో ఉపాధ్యాయులతో కలిసి సీఆర్‌పీలు బుధవారం బడి మానేసిన పిల్లలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా 6 నుంచి 14 సంవత్సరాలలోపు విద్యార్థులను బడిలో చేర్పించేందుకు విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీరాములు, ఉపాధ్యాయులు, సీఆర్‌పీ పాపయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని నల్లకుంట కాలనీలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో రెండు రోజుల కిందట గుడిసె దగ్ధమైన బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని వైఎస్సార్‌టీపీ కో ఆర్డినేటర్ అతికూర్ రహ్మాన్ అన్నారు. బుధవారం బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి తక్షణ సాయం చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీపీ నాయకులు ఉన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

మల్దకల్: క్రీడల్లో గెలుపోటములు సహజమని సర్పంచు రాధ అన్నారు. బుధవారం మండలంలోని ఎల్కూరులో సంక్రాంతి పండగను పురస్కరించుకుని గ్రామ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ఆమె ప్రారంభించారు. క్రీడాస్ఫూర్తితో ఆడాలని సూచించారు. కార్యక్రమంలో గంగన్న, ఆంజనేయులు, యూత్‌సంఘం సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్య తీసుకోవాలి

గట్టు: మండల కేంద్రంలోని తుమ్మలచెరువులో విద్యుదాఘాతంతో ప్రియాంక(9) మృతి చెందిన సంఘటనపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు బల్గెర శివారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాధిత కుటుంబానికి పరిహారం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అవనిశ్రీ వీరేష్‌కు స్మారక పురస్కారం

మల్దకల్: మండలంలోని దాసరపల్లి గ్రామానికి చెందిన కవి అవనిశ్రీ వీరేష్‌కు మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడలో నిర్వహించిన మహాకవి మద్దూరి నాగేష్‌బాబు 18వ వర్ధంతి సందర్భంగా స్మారక పురస్కారాన్ని అందుకున్నట్లు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పురస్కార గ్రహీతను గ్రామస్తులు, యువకులు అభినందనలు తెలిపారు.

పాఠశాలల సందర్శన

అలంపూర్ రూరల్: మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదారబాద్ టీఎస్ యూటీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పావన్నగారి మణిక్య రెడ్డి బుధవారం అలంపూర్‌లోని జూనియర్ కళాశాల, బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాల, కస్తూర్బా, జెడ్పీహెచ్‌ఎస్(హరిజన వాడ)పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిప్పన్న, ప్రధాన కార్యదర్శి గోపాల్, డి. రమేష్, చక్రధర్ ఉన్నారు.

అంగన్‌వాడీ సేవలపై అవగాహన

మానవపాడు: ప్రతి అంగన్‌వాడీ సెంటర్‌లో గర్భిణులకు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్, సీడీపీఓ సుజాత అన్నారు. బుధవారం మండలంలోని చెన్నిపాడు, మద్దూరు, మానవపాడులో అంగన్‌వాడీ సెంటర్లను పరిశీలించారు. చిన్నారుల తల్లిదండ్రులకు సమావేశం నిర్వహించి పలు సలహాలు, సూచనలు చేశారు.

అద్దె భవనంలో అన్నీ సమస్యలే..



ఉండవెల్లిలో రేకుల షెడ్డులో నేలపై పడుకున్న విద్యార్థులు

- బాలుర వసతి గృహంలో అరకొర వసతులు
- పట్టించుకోని అధికారులు

ఉండవెల్లి: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎస్సీ సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు తాండవిస్తున్నాయి. కనీసం పక్కా భవనాలు లేక అద్దె భవనాలతోనే నెట్టుకురావాల్సిన దుస్థితి నెలకొంది. పేద విద్యార్థుల విద్య కోసం ఎన్నో నిధులను వెచ్చిస్తున్నా ఉపయోగంలేకుండా పోతోంది. ఎన్నో ఆశలలో పిల్లల భవిష్యత్ దృష్టిలో ఉంచుకొని తల్లిదండ్రులు చిన్నారులను సంక్షేమ హాస్టళ్లకు పంపిస్తే విద్యార్థులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఉన్న అద్దె భవనంలో అడుగడుగునా సమస్యలే దర్శనమిస్తున్నాయి. పర్యవేక్షించాల్సిన అధికారులు పత్తాలేకుండా పోయారని విమర్శలు వినిపిస్తున్నాయి.

అద్దె భవనంతో అవస్థలు

మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహం శిథిలావస్థకు చేరింది. దీంతో విద్యార్థులను అద్దె భవనంలోకి విద్యార్థులకు వసతి ఏర్పాటు చేశారు. కనీస మౌలిక వసతలు లేక విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. మరుగుదొడ్లు, ఇరుకు గదులతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అద్దె భవనంలోకి వచ్చి మూడేళ్ల గడిచినా అధికారులు సమస్యలు పరిష్కరించడం లేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. 2016 సంవత్సరం వసతి గృహంలో దాదాపు 180 మంది విద్యార్థులు ఉండగా అద్దె భవనం తీసుకున్న తర్వాత రోజురోజుకు విద్యార్థుల సంఖ్య తగ్గుముఖం పట్టింది. ప్రస్తుతం 90 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. 2019 వ సంవత్సర నుంచి నెలకు రూ.22,915లు అద్దె చెల్లిస్తున్నారు.

విద్యార్థులు గజగజ

అద్దె వసతి గృహంలో కిటికీలు, తలుపులు సరిగ్గా లేకపోవడంతో చలికి గజగజ వణుకుతున్నారు. రాత్రి వేళ పాములు, విష పురుగులు వసతి గృహంలోకి ప్రవేశిస్తున్నాయని విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. తీవ్రమైన చలికి దుప్పట్లు తడుస్తున్నాయని పలువురు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. సరిపడ మరుగుదొడ్లు లేక బహిరంగ ప్రదేశాలకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని వాపోయారు. కనీస వసతులు లేక విద్యార్థులు ఇంటి బాట పడుతున్నా సంబంధిత అధికారుల్లో చలనం లేదని పలువురు ఆరోపించారు. మంచాలు లేక నేలపై నిద్రించాల్సిన దుస్థితి ఏర్పడింది.

చలికి తట్టుకోలేకపోతున్నాం



రాత్రివేళ చలికి తట్టుకోలేకపోతున్నాం. మంచుకు దుప్పట్లు, బెడ్లు కూడా తడుస్తున్నాయి. మంచాలు లేక నేలపై పడుకుంటున్నాం. ఎప్పుడు గోడలు కూలిపోతాయో తెలియక భయం భయంగా నిద్రిస్తున్నాం. త్వరగా వసతి భవనం నిర్మాణం చేపట్టాలి.

– రవూఫ్ బాషా, 8వ తరగతి

కనీస వసతులు లేవు



అద్దె భవనంలో కనీస వసతులు లేవు. రేకుల షెడ్డులోనే భోజనం చేయాలి. డైనింగ్ హాల్ లేదు. మరుగుదొడ్లు లేక బయటకు వెళ్తున్నాం. నీటి వసతి కూడా లేదు. పెట్టెలు, సామాన్లు పెట్టుకోవడానికి లాకర్లు లేక ఒకే గదిలోనే ఏర్పాటు చేసుకున్నాం. ఇప్పటికైనా వసతి గృహంను నిర్మించాలి.

– అరవింద్, 6వ తరగతి

ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం

వసతి గృహంలో మరుగుదొడ్లు తక్కువ ఉండడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతుండడం వాస్తవమే. వసతి గృహం నిర్మాణం కోసం ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపించాం. దాదాపు రూ.2 కోట్ల నిధులు అవసరం. ఇదివరకే అడిషనల్ కలెక్టర్‌కు సమస్యను వివరించాం. సమస్యల పరిష్కారానికి అన్ని విధాలా చర్యలు తీసుకుంటుంన్నాం.

– శ్వేత ప్రియదర్శిని, డీఎస్‌సీడీఓ

మతోన్మాద విధానాలను వ్యతిరేకిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంవీ రమణ

గద్వాల అర్బన్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద విధానాలను వ్యతిరేకిద్దామని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎంవీ రమణ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటీకరణ చేస్తూ ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్ల ఇవ్వడంలో జాప్యం చేయడం తగదన్నారు. పేదలకు రేషన్ బియ్యాన్ని వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, కమిటీ సభ్యులు రేపల్లె దేవదాసు, రాజు, పరంజ్యోతి, వీవీ నర్సింహా, ఈదన్న, రాములు తదితరులు పాల్గొన్నారు.

సాట్స్ చైర్మన్‌ను కలిసిన నాయకులు



సాట్స్ చైర్మన్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

గద్వాల: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ స్టేట్(సాట్స్) చైర్మన్ ఆంజనేయగౌడ్‌ను తైక్వాండో కరాటే అసోసియేషన్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి శ్రీహరిల ఆధ్వర్యంలో సాట్స్ చైర్మన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో క్రీడల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. తైక్వాండో అసోసియేషన్‌లో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం సమస్యలపై వినతి పత్రం అందజేశారు.

వడ్డెర ఓబన్న విగ్రహ ఏర్పాటుకు కృషి

గట్టు: స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డెర ఓబన్న విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తానని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన వడ్డెర ఓబన్న జయంతికి ఆయన హాజరై నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశం కోసం పోరాటం చేసిన యోధుల్లో వడ్డెర ఓబన్న ఒకరన్నారు. ఉయ్యాలవాడ నర్సింహారెడ్డి అనుచరుడిగా వడ్డెర ఓబన్న ఉంటూ అప్పట్లో బ్రిటిష్ పాలకులపై ఇద్దరు కలిసి పోరాటం చేశారని గుర్తు చేశారు. ఓబన్న విగ్రహంతో పాటు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయాల సంస్థ జిల్లా చైర్మన్ జంబు రామన్‌గౌడ్, జెడ్పీటీసీ బాసు శ్యామల, సర్పంచు ధనలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, నాయకులు హనుమంతురెడ్డి, రామునాయుడు, బజారి, కృష్ణ, వెంకటేష్, వెంకటన్న, బూదెప్ప, ప్రాణేష్, నవీన్‌చారి, వడ్డెర సంఘం నాయకులు పాల్గొన్నారు.



చింతలపేటలో నివాళులర్పిస్తున్న నాయకులు

ఘనంగా వడ్డే ఓబన్న జయంతి

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని చింతలపేటలో వడ్డేర సంఘం ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డేర ఒబన్న 216వ జయంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్డే ఒబాన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కృష్ణ, గోపాల్, నాగరాజు, పరుశరాముడు, రామకృష్ణ, రాజు, గట్టు నాగన్న, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ వెంచర్లను తొలగించాలని వినతి

ధరూరు: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా వెంచర్లు వేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి మండల నాయకులు బుధవారం పంచాయతీ కార్యదర్శి గురునాయక్‌కు వినతి పత్రం అందజేశారు. మండలంలోని నెట్టెంపాడు గ్రామ శివారులో అక్రమ వెంచర్లు వేయడమే కాకుండా ప్రభుత్వ ఆర్‌అండ్‌బీ స్థలాలను ఆక్రమించి ప్లాట్లు చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గోవిందు, రమేష్, నాగేష్, మల్లేష్, ఎల్లప్ప, శివన్న, దేవన్నలు పాల్గొన్నారు.



పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సకాలంలో పన్ను చెల్లించండి

అయిజ: ఆస్తి పన్ను సకాలంలో చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ నర్సయ్య అన్నారు. బుధవారం పట్టణంలోని కొత్త బస్టాండ్‌లో ఆయన ఆస్తిపన్ను వసూలు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడారు. దాదాపు 600 ఇండ్లకు సంబంధించి ఎనిమిది సంవత్సరాలుగా ఆస్తి పన్ను బకాయి సుమారు రూ. 60 లక్షలు ఉందన్నారు. ఆస్తిపన్ను చెల్లించని వారిపై మున్సిపల్ చట్టం 2019 ప్రకారం తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రాజేష్ కుమార్, సీనియర్ అసిస్టెంట్లు రమేష్, లక్ష్మన్న, బిల్ కలెక్టర్లు మహేంద్రనాథ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ఆస్తిపన్ను వసూలు చేస్తున్న కమిషనర్

ప్రణాళిక రూపొందించండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ సాయిప్రకాష్

అయిజ: గ్రామాల అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికను పకడ్బందీగా రూపొందించాలని ఎంపీడీఓ సాయిప్రకాష్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో 2023 నుంచి 2024 సంవత్సరం వరకు చేపట్టాల్సిన పనులను గుర్తించే విషయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఒకరోజు శిక్షణను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీఓ నరసింహారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచారం తప్పనిసరి

అలంపూర్: పాఠశాలల సమగ్ర సమాచారం తప్పనిసరిగా పొందుపర్చాలని ఉండవెల్లి ఎంఈఓ శివప్రసాద్ సూచించారు. బుధవారం అలంపూర్ చౌరస్తాలోని వైష్ణవి పాఠశాలలో ఉండవెల్లి, మానవపాడు మండలాల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. యూ–డైస్ ప్రొఫార్మాలో అన్ని పాఠశాలల్లోని సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు, కంప్యూటర్లు, ప్రహరీలు, అదనపు తరగతి గదులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల నిష్పత్తి, టాయిలెట్స్, మరుగుదొడ్లు, వివిధ అంశాలపై చర్చించారు. సమావేశంలో రామకృష్ణ, విష్ణు, అనితబాయి, శాంతిరాజు, రాములు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలు తిప్పికొడదాం

అలంపూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు తిప్పికొడదామని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నరసింహా పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని గాంధీ చౌక్‌లో సీఐటీయూ జాతీయ మహాసభలను పురస్కరించుకొని ఆ సంఘం జెండాను జిల్లా ఉపాధ్యక్షురాలు ఏమేలమ్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరసింహా మాట్లాడుతూ 17వ జాతీయ మహాసభలు బెంగుళూరులో ఈ నెల 18వ తేదీ నుంచి 22వ తేదీ వరకు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, నర్మద, పద్మావతి, నాగవేణి, మాసుంబీ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలకు పాదయాత్ర

కేటీదొడ్డి: మండలంలోని నందిన్నెకి చెందిన 45 భక్తులు బుధవారం తిరుమలకు పాదయాత్రగా బయలుదేరారు. అంతకు ముందు ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు.

బీజేపీని బలోపేతం చేద్దాం

అయిజ: ప్రతి పట్టణంలో, పల్లెల్లో బీజేపీని బలోపేతం చేద్దామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో 79వ బూత్ స్థాయి కమిటీని నియమించి, నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో అలంపూర్ అసెంబ్లీ కన్వీనర్ మెడికల్ తిరుమల రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నరసింహయ్యశెట్టి, ఉపాధ్యక్షుడు జానకిరాముడు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రాజోళి: మండలంలోని చిన్న ధన్వాడలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ శ్రీనువాసులు తెలిపారు. తుంగభద్ర నది నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారనే సమాచారంతో గ్రామానికి చెందిన కుర్వ జయన్న, బోయ రాముడుకు చెందిన ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించారు. ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

నేడు వైద్య శిబిరం

కేటీదొడ్డి: వివేకనంద జయంతిని పురస్కరించుకుని ఈ నెల 12న మండల కేంద్రంలోని పాఠశాల ఆవరణలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పరవస్తు క్రియోటివ్ ఫౌండేషన్ కో– ఆర్డినేటర్ గద్దె భాస్కర్, సత్తార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేటి నుంచి కబడ్డీ టోర్నీ

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లిలో సంక్రాంతి పండుగ సందర్భంగా పోతురాజు శంకరమ్మ సేవాదళం ఆధ్వర్యంలో ఈనెల 12 వ తేదీ నుంచి ఓపెన్ టు కబడ్డీ పోటీలను నిర్వహించనున్నట్లు సేవాదళం సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల జట్లు సెల్: 9381133750, 9550856143 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఆర్థికసాయం అందజేత

గద్వాల రూరల్: పట్టణంలో ఈ నెల 9వ తేదీన నల్లకుంటలో విద్యుదాఘాతంతో మేదరి ఎల్లయ్య ఇళ్ల కాలిపోయింది. విషయం తెలుసుకున్న చుక్కల వెంకటేష్ బాధితుడికి బియ్యం, అవసరమైన సరుకులు అందించగా, మాజీ కౌన్సిలర్ పులిపాలి వెంకటేష్ రూ.10వేల ఆర్థిక సాయం చేశారు. ప్రభుత్వం బాధితుడిని ఆదుకోవాలని కోరారు.

ధరూరు: మండలంలోని చెన్నారెడ్డిపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త చిన్న వెంకటన్న అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న బూరెడ్డిపల్లి సర్పంచు బండ్ల జ్యోతి బాధితుడి ఇంటికి వెళ్లి ఆరోగ్య వివరాలను తెలుసుకున్నారు. అనంతరం ఆర్థికసాయం అందజేశారు.

14న భజన పోటీలు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని బి.వీరాపురంలో సంక్రాంతి పండగ సందర్భంగా శివాంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 14న భజన పోటీలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 9542351616, 9848532941 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

రికార్డుల తనిఖీ

మానవపాడు: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్‌ను సూపర్‌వైజర్ ఆస్మా సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీచర్లు సమయపాలన పాటించి అంగన్‌వాడీలో యాప్‌ల వివరాలు పొందుపర్చాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచరు విమల, చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తరలిన నాయకులు

గద్వాల అర్బన్: కృష్ణా, తుంగభద్ర నది పరివాహక ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని తెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షుడు అలూరు ప్రకాష్ గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయం నుంచి హైదరాబాద్‌లో నిర్వహించిన జలదీక్షకు నాయకులు, కార్యకర్తలు బయలుదేరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అయిజ: పట్టణంలోని 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో అభివృద్ధి పనులు కారణంగా గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయ కలుగుతుందని అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఉప్పల, జడదొడ్డి, బింగుదొడ్డి గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయిలో విద్యార్థుల ప్రతిభ

మల్దకల్: మండలంలోని అమరవాయి జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన విద్యార్థులు సత్యం, ప్రవీణ్‌లు రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌లో మూడో స్థానంలో నిలిచినట్లు పాఠశాల హెచ్‌ఎం జానకమ్మ తెలిపారు. నిర్మల్ జిల్లాలో ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు జరిగిన 50వ రాష్ట్రస్థాయి వైజ్ఞానిక పర్యావరణ ఇన్‌స్పైర్ అవార్డు ప్రదర్శనలో ప్రతిభ కనబరచారు. ఈ నెల చివరి వారంలో కేరళలోని తిరుచ్చిలో నిర్వహించే దక్షిణ భారత స్థాయి పోటీలలో పాల్గొంటారని వివరించారు. గెలుపొందిన వారికి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి బహుమతులు అందజేసినట్ల హెచ్‌ఎం పేర్కొన్నారు.

ఆదిశిలా క్షేత్ర అభివృద్ధికి కృషి

మల్దకల్: ఆదిశిలా క్షేత్రం స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి అన్నారు. బుధవారం మల్దకల్ ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు హైదరాబాదులో కేవీ రమణాచారి, దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్‌లను వేర్వేరుగా కలిసి స్వామి వారి ప్రసాదం, ఆలయ చరిత్ర పుస్తకాలను అందజేశారు.

మార్కెట్ యార్డు చైర్మన్‌కు సన్మానం

రాజోళి: గద్వాల మార్కెట్ యార్డు నూతన చైర్మన్‌గా ఎన్నికైన గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు పచ్చర్ల శ్రీధర్ గౌడ్‌ను రాజోళి, వడ్డేపల్లి గౌడ సంఘం నాయకులు బుధవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువా పూలమాలలతో సన్మానించారు. గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు రాధాకృష్ణ గౌడ్, ఆర్.కృష్ణ గౌడ్, వీరేష్ గౌడ్, రామన్ గౌడ్, వెంకట్రాజ గౌడ్, లచ్చ గౌడ్, వెంకట్రామన్ గౌడ్ పాల్గొన్నారు.

బీజేపీ విజయం తథ్యం

అలంపూర్ రూరల్: రాబోయే ఎన్నికల్లో బీజేపీ విజయం తథ్యమని ఆ పార్టీ నాయకులు ప్రభారి సబిరెడ్డి వెంకట్‌రెడ్డి జిల్లా కార్యదర్శి రవికుమార్ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం మండలంలోని క్యాతూర్‌లో వారు పర్యటించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి, నాయకులు దానారెడ్డి, వేముల బాబు, రవీందర్ రెడ్డి, కామేష్ రెడ్డి, నాగిరెడ్డి, మల్లయ్య, రామన్‌గౌడ్ తదితరులు ఉన్నారు

నోట్ పుస్తకాలు పంపిణీ

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని జమ్ములమడుగు, ఎన్టీఆర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం పట్టణ సేవాసమితి సభ్యుడు అస్లాంషరీఫ్ పుట్టిన రోజు సందర్భంగా పలకలు, నోట్‌పుస్తకాలు, పెన్నులు, ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమిజాబీ పాల్గొన్నారు.

వరద బాధితులకు న్యాయం చేయాలి

అలంపూర్: వరద బాధితులకు న్యాయం చేయాలని బీజేపీ జిల్లా కార్యదర్శి రవికుమార్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో 2009 వరద బాధితులకు ఇండ్ల స్థలాలు, ఇండ్లను నిర్మించి న్యాయం చేయాలని తహసీల్దార్ సుభాష్ నాయుడుకు ఆయన వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం స్పందించకపోతే దీక్షలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్ రెడ్డి, నాగన్న తదితరులు పాల్గొన్నారు.